సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా లావణ్య

- జమ్మికుంటకు అయాజ్ బదిలీ

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 14: సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ అయాజ్ బదిలీపై జమ్మికుంటకు వెళ్లనున్నారు. హైదరాబాద్ (జీహెచ్ఎంసీ)లో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న లావణ్య ఇక్కడికి బదిలీపై రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కిశోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు జరిగినట్లు ఆయన తెలిపారు.

స్వామివారికి పూజలు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 14: రేవతి నక్షత్రం సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ప్రాతఃకాల పూజల అనంతరం అనంతపద్మనాభ స్వామివారికి ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అభిషేక పూజలు నిర్వహించారు.

గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

కోనరావుపేట, ఫిబ్రవరి 14: దేశ వ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సమ్మెకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 16న కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ నాయకులు బొల్లె బాబు, శ్రీను, శేఖర్ ఉన్నారు.

'గృహజ్యోతి'ని వినియోగించుకోవాలి

రుద్రంగి, ఫిబ్రవరి 14: గృహజ్యోతి పథకాన్ని వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని సెస్ ఏఈ మహేశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 200యూనిట్ల ఉచిత కరెంట్ కోసం మండల సెస్ కార్యాలయంలో కరెంట్‌బిల్, ఆధార్, రేషన్, ఫోన్ నంబర్లతో సంప్రదించాలని సూచించారు. ఈ నెల 15 చివరి తేదీ ఉండడంతో, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సెస్ ఏఈ కోరారు.

వేములవాడ టౌన్: శిశుమందిర్ పాఠశాలలో సరస్వతీ జ్ఞాన యజ్ఞం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ రూరల్: అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చందుర్తి: సరస్వతీదేవి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా వసంతపంచమి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- చిన్నారులకు అక్షరాభ్యాసం

వేములవాడ టౌన్/ వేములవాడ రూరల్/ ఇల్లంతకుంట/రుద్రంగి/చందుర్తి, ఫిబ్రవరి 14: వేములవాడ మండలం అగ్రహారం శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో వసంతపంచమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయంలోని సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారని ఆలయ ఈవో మారుతి తెలిపారు. అలాగే వేములవాడ పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో హెచ్ఎం చిలుక గట్టు ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు చంద్రగిరి దాశరథిశర్మ ఆధ్వర్యంలో సరస్వతీ జ్ఞాన యజ్ఞం చేశారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణీనికేతన్, శ్రీవాణి పాఠశాలల్లో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఇక్కడ కరస్పాండెంట్ తూంకుంట శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీకాంత్, సురేశ్, ప్రిన్సిపాల్ తూంకుంట శ్రీనిధి, కొహెడ సత్యనారాయణ ఉన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సరస్వతీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో ప్రిన్సిపాల్ హరినాథ్‌రాజు, కరస్పాండెంట్ ఎలిగేటి నరేశ్, తదితరులు ఉన్నారు. చందుర్తి మండలం జోగాపూర్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఇక్కడ ఎంపీటీసీ మ్యాకల గణేశ్, హెచ్ఎం ఎడ్ల కిషన్, ఉపాధ్యాయురాలు కవిత, అంగన్‌వాడీ టీచర్ విజయ, ఎస్ఎంసీ చైర్మన్ తిరుపతి, తదితరులు ఉన్నారు.

రుద్రంగిలో: వేడుకల్లో పాల్గొన్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

సరస్వతీ విగ్రహం ఏర్పాటు

గంభీరావుపేట, ఫిబ్రవరి 14: నాగంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సరస్వతీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వసంత పంచమిని పురస్కరించుకొని రుద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవిష్కరణ చేశారు. అమ్మవారి విగ్రహంపై షెడ్డు నిర్మాణానికి కొండ ఆంజనేయులుగౌడ్ రూ.15వేలు అందించారు. ఇక్కడ హెచ్ఎం మంజులు, ఎంపీటీసీ మేర్గు నాగభూషణం, మాజీ సర్పంచ్ దోమకొండ ఎల్లం, రుద్ర ఫౌండేషన్ సభ్యులు, ఉన్నారు.

గంభీరావుపేట: పాఠశాలలో సరస్వతీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రుద్ర ఫౌండేషన్ సభ్యులు

ఇల్లంతకుంట: సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు

భక్తులకు ఇబ్బందులు రానివ్వద్దు

ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ట్రైనీ ఎస్పీ రాహుల్‌రెడ్డి

- 'మహా శివరాత్రి' జాతర ముగిసే వరకు ఆలయం మీదుగా ఆటోలకు నో ఎంట్రీ
- ట్రైనీ ఎస్పీ రాహుల్‌రెడ్డి

వేములవాడ, ఫిబ్రవరి 14: రాజన్న దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు రానివ్వకుండా చూడాలని ట్రైనీ ఎస్పీ రాహుల్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లు, యజమానులతో సమావేశమై, మాట్లాడారు. రాజన్న సన్నిధికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నందున ప్రధాన రహదారి తోపాటు ఆలయ పరిసరాల్లో రద్దీ అధికంగా ఉంటుందని చెప్పారు. వాహనాలు, ఆటోల రాకపోకలతో భక్తులకు నడవడానికి కూడా ఇబ్బంది ఉండడంతో మహాశివరాత్రి జాతర వరకు ప్రధాన ఆలయం మీదుగా ఆటోలను అనుమతించబోమని చెప్పారు. రెండు బైపాస్ రహదారుల మీదుగా ఆటోలను అనుమతించడంతో ప్రజలకు యథావిధిగా సౌకర్యాలు అందించాలని సూచించారు. జాతరలో చోరీలు ఎక్కువగా జరిగే అవకాశం ఉండడంతో, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం అందించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనదారులు, పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆటోలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎస్పీ నాగేంద్రాచారి, సీఐలు కరుణాకర్, శ్రీనివాస్, ఎస్ఐలు అంజయ్య, మారుతి, డివిజన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు దేవరాజు, నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, లింగంయాదవ్, సాబీర్, మర్రిపల్లి రాజు, యూసుఫ్, జమిని, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో అర్ధ మండల శివదీక్షలు

దీక్షాపరుడికి మాలధారణ చేస్తున్న గురుస్వామి గోపి

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 14: వేములవాడ రాజన్న క్షేత్రంలోని కళాభవన్‌లో బుధవారం శివదీక్షాపరులు ఘనంగా అర్ధ మండల శివ దీక్షలు తీసుకున్నారు. ఉదయం గురుస్వామి వాసాలమర్రి గోపి ఆధ్వర్యంలో శివ దీక్షాపరులకు అర్చకుడు నందగిరి భాను, గురుస్వాములు గోపి, భీమన్న వేదమంత్రాల మధ్య మాలధారణ చేయగా, దాదాపు 300మంది శివ దీక్ష స్వీకరించారు. మార్చి 8న మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాత్రి 7గంటల తర్వాత రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో మాలవిరమణ చేయవచ్చని గురుస్వాములు తెలిపారు.

సిరిసిల్ల టౌన్: వధూవరులను ఆశీర్వదిస్తున్న టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్

వివాహ వేడుకలకు హాజరు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 14: సిరిసిల్లలోని లహరి కల్యాణ మండపంలో బుధవారం టీఎన్‌జీవో జిల్లా సెక్రటరీ గాజుల సుదర్శన్ సోదరుడి కూతురి వివాహం జరుగగా, ఈ వేడుకకు టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు మెట్ట శ్రీకాంత్, కోశాధికారి రియాజ్‌పాషా, ఉన్నారు. అలాగే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ పీఎస్ శ్రీనివాస్ కూతురు వివాహం హైదరాబాద్‌లో జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ముస్తాబాద్, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలోని ఏఎంఆర్ గార్డెన్‌లో గూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నేత ఈడుగురాళ్ల సంతోష్‌గౌడ్ సోదరుడు నరేందర్‌గౌడ్– లయశ్రీ వివాహం జరిగింది. ఈ వేడుకకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యక్తిగత కార్యదర్శులు కుంబాల మహేందర్‌రెడ్డి, గన్‌రాజ్, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, నాయకులు కొమ్ము బాలయ్య, చాడ శ్రీనివాస్, హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

హైమాస్ట్ లైట్ ప్రారంభం

చందుర్తి, ఫిబ్రవరి14: కొత్తపేటలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను జడ్పీటీసీ నాగం కుమార్ బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని నిర్వహించగా, జడ్పీటీసీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ ఎంపీటీసీ రమేశ, మాజీ సర్పంచ్ లాస్య, నేతలు పిట్టల ప్రసాద్, స్వామి, బాలు, గంగ మల్లయ్య, తిరుపతి ఉన్నారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 14 : త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఓట్ల లెక్కింపు కోసం చేస్తున్న ఏర్పాట్లను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కరీంనగర్, మానకొండూర్, హుజూరాబాద్, వేములవాడ, సిరిసిల్ల, చొప్పదండి, హుస్నాబాద్ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల లెక్కింపును ఎస్సారార్ కళాశాలలో నిర్వహిస్తామని వెల్లడించారు. అందుకోసం అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేస్తున్నామని పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు

ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/కోనరావుపేట/ సిరిసిల్ల రూరల్/ వేములవాడ రూరల్, ఫిబ్రవరి 14: పలువురు ఎంపీడీవోలు బుధవారం మండల పరిషత్ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డిపేట ఎంపీడీవోగా జీ సత్తయ్య, ఇల్లంతకుంటలో శ్రీనివాసమూర్తి, కోనరావుపేటలో శశికళ, తంగళ్లపల్లిలో అదనపు డీఆర్డీవో బీ వెంకటేశ్వర్లు, వేములవాడలో మల్లోజ్జా, వేములవాడ రూరల్‌లో శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం అధికారులు, సిబ్బంది వారికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఆర్థిక సాయం

రుద్రంగి, ఫిబ్రవరి14: మండల కేంద్రంలో పల్లి మనీషా అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో సెకండియర్ చదువుతున్నది. బాధిత కుటుంబ పరిస్థితి తెలుసుకున్న గోపా సభ్యుడు లక్ష్మీనారాయణగౌడ్ మనీషా ఉన్నత చదువుల కోసం ₹10 వేలు అందించారు. ఇక్కడ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సభ్యులు ఉన్నారు.

₹2లక్షల రుణమాఫీ అయ్యిందా?

- ఎన్నికల ప్రచారంలో హామీలు.. అమలుకు కోడ్‌తో కాలయాపన
- మళ్లీ ఎన్నికలు వస్తేనే గ్రామాలకు కాంగ్రెసోళ్లు
- ఎంపీ బండి సంజయ్‌కుమార్



గంభీరావుపేట: మండల కేంద్రంలో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

గంభీరావుపేట/ ముస్తాబాద్, ఫిబ్రవరి 14: ఎన్నికలు రాగానే కాంగ్రెసోళ్లు గ్రామాలకు వచ్చి హామీలు ఇస్తరు.. అమలు చేయమని అడిగితే కాలయాపన చేస్తున్నారని.. పార్లమెంట్ ఎన్నికల కోడ్ పేరిట మిగతా గ్యారెంటీ పథకాలకు మంగళం పాడనున్నారని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజాహిత కార్యక్రమంలో బుధవారం ఆయన మండల కేంద్రంతోపాటు లింగన్నపేట, కొత్తపల్లి గ్రామాలతోపాటు ముస్తాబాద్ మండల కేంద్రంలో పర్యటించారు. అంతకుముందు రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి, మాట్లాడారు. ఎన్నికల వస్తేనే కాంగ్రెసోళ్లు గ్రామాలకు వచ్చి గ్యారెంటీ పథకాల పేరిట హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మళ్లీ ఎన్నికలు వస్తే వారు మన వద్దకు వచ్చి అమ లు గానీ మిగతా పథకాలపై ఎన్నికల కోడ్ పేరిట కథలు చెబుతారన్నారు. అసెంబ్లీ ఎన్నికల హామీలో భాగంగా డిసెంబర్ 9న ఇస్తానన్న రెండు లక్షల రుణమాఫీ ఏమైందని, మహిళలకు ₹2,500 ఖాతాలో వేశారా? ఎకరానికి ₹15వేల రైతు బంధు ఇస్తున్నారా? అని విమర్శించారు. రాముడు అయోధ్యలోనే పుట్టిండా.. అని ప్రశ్నించే సోనియా, రాహుల్ వంటి చరిత్ర తెలియని కాంగ్రెసోళ్లకు ఓట్లు వేసి రాష్ట్ర ప్రజలు మోసపోయారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాణిరుద్రమాదేవి, రెడ్డబోయిన గోపి, ఎర్రం మహేశ్, తదితరులు ఉన్నారు.

ఐదేళ్లలో ఎంపీ నిధులు గుండు సున్నా

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా

- 'ప్రజాహిత'తో ప్రజలను మోసం చేస్తున్న 'బండి'
- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా

కోనరావుపేట, ఫిబ్రవరి 14: కరీంనగర్ ఎంపీగా గెలిచి ఐదేళ్లు కావస్తున్నా.. మండలానికి బండి సంజయ్ తెచ్చిన నిధులు గుండు సున్నా అని.. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా విమర్శించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా.. ఎంపీ సంజయ్ మండలానికి చేసిందేమీలేదన్నారు. ఐదేండ్లలో గుర్తుకు రాని ప్రజలు.. ఎన్నికల వేళ గుర్తుకు వస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రతో ప్రజలను మోసం చేయడం తప్ప మరోటిలేదన్నారు. ఎంపీ నిధులతో అభివృద్ధి అక్కడ చేశారో స్థానిక నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక్కడ జిల్లా కార్యదర్శి చందనగిరి గోపాల్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బొర్ర రవీందర్, తదితరులు ఉన్నారు.

పోలింగ్ సిబ్బంది వివరాలు పక్కాగా ఉండాలె

- కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, ఫిబ్రవరి 14: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది వివరాలు పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కంట్రోల్ రూమ్‌లో జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే తీరును అదనపు కలెక్టర్ పీ గౌతమితో కలిసి పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో సిబ్బందికి విధులు కేటాయించేందుకు వీలుగా అన్ని వివరాలు సక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. తర్వాత కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్లను సందర్శించారు. ఇక్కడ డీఈవో రమేశ్‌కుమార్, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ ఉన్నారు.

కలెక్టర్‌నుకలిసిన ఐపీఆర్ ఏడీ మామిండ్ల దశరథం, ఏపీఆర్వో శారద

కలెక్టర్‌ను కలిసిన ఏపీఆర్వో

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అనురాగ్ జయంతిని ఏపీఆర్వో శారద బుధవారం జిల్లా పౌరసంబంధాల అధికారి (ఏడీ) మామిండ్ల దశరథంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అంతకుముందు బాధ్యతలు స్వీకరించిన జడ్పీసీఈవో ఉమారాణి, డీపీవో వీరబుచ్చయ్య, డీఆర్డీవో శేషాద్రి కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ పూజారి గౌతమిని కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఐపీఆర్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు సన్మానం

డీపీఆర్వోగా ఉత్తమ సేవలందించి బదిలీల్లో భాగంగా హైదరాబాద్ వెళ్తున్న ఐపీఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ మామిండ్ల దశరథంను కలెక్టర్ సన్మానించారు. డీపీర్వోగా అందించిన సేవలను కొనియాడారు. ఇక్కడ ఏపీఆర్వో కొప్పుల రవి, పబ్లిసిటీ అసిస్టెంట్ వాసం వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్

గంభీరావుపేట, ఫిబ్రవరి 14: రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన అజ్మతుల్లా హుస్సేనీ ప్రభుత్వం నియమించింది. ఈ క్రమంలో బుధవారం ఆయన హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కాగా, ఈ నెల 16న అజ్మతుల్లా హుస్సేనీ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్‌కు కేటీఆర్ ఆశీర్వాదం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో దేవేందర్‌యాదవ్, నేతలు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 14: గండిలచ్చపేటకు చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ బండి దేవేందర్‌యాదవ్ బుధ వారం తన బర్త్‌డే సందర్భంగా హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా దేవేంద ర్‌యాదవ్‌ను రామన్న ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, నేతలు ఆత్మకూరి చంటి, మోతే మహేశ్ ఉన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

చెక్కు అందజేత

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 14: కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఖాతాదారుడు బల్లెపు స్వామి ఇటీవల మృతి చెందాడు. ఈ క్రమంలో పీఎంజేజేబీవై ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును సిరిసిల్లలోని బ్యాంకు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు బుధవారం అందజేశారు. ఇక్కడ కేడీసీసీబీ డైరెక్టర్ వీరబత్తిని కమలాకర్, సిరిసిల్ల పీఏసీఎస్ చైర్మన్ బండి దేవదాస్ ఉన్నారు.

మట్టిని తవ్వితే చర్యలు

బోయినపల్లి (కలెక్టరేట్), ఫిబ్రవరి 14: జిల్లాలో ఎవరైనా అక్రమంగా మట్టిని తవ్వినా.. తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్‌శాఖ సహాయ సంచాలకుడు ఎం రఘుబాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన బోయినపల్లి మండ ల కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 1,500మెట్రిక్ టన్నుల చెరువు మట్టిని గుర్తించి, రూ.లక్షా 80వేల జరిమానా విధించి ప్రభుత్వ ఖజానాలో జమచేశారు. మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాపై మార్చి 31 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా ఖనిజాలను తవ్వినా, నిల్వ చేయాలంటే ముందస్తుగా మైనింగ్ శాఖ నుంచి అనుమతి పొందాలని స్పష్టం చేశారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 14: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. జోనల్ మేనేజర్ అమర్‌నాథ్ రాజు, దివ్య, హెచ్ఆర్ డివిజనల్ మేనేజర్ జ్ఞానేశ్వర్‌రావు ఇంట ర్వ్యూ చేశారు. అంతకు ముందు వసంత పంచమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ ప్రిన్సిపాల్ రజినీ, వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు, అనూష, అధ్యాపకులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437-All

BUILDING FOR SALE

★గోదావరిఖని జిఎం ఆఫీస్ కాలనీ లోని మేయిన్ రోడ్‌కు ఉన్న ఇండిపెండెంట్ డబుల్ బెడ్ రూమ్ గల బిల్డింగ్ అమ్మబడును. మధ్య వర్తులు లేరు. ఇంటి ఓనర్ సెల్ నెంబర్: 7382437207
NTK-317412

CHANGE OF NAME

★I, AYESHA BATOOL, D/o. Syed Gouse, R/o. 3-6-395, Subash Nagar, Karimnagar, TS. Changed My Name as AYESHA BATHUL, D/o. Syed Gouse.
NT-311754

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194